పర్యావరణ పరిరక్షణ, వర్షపునీటిపై అవగాహన కల్పించాలి



పర్యావరణ పరిరక్షణ, వర్షపు నీటి వినియోగంపై అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ రాములు

మైలార్‌దేవ్‌పల్లి: పర్యావరణ పరిరక్షణ, వర్షపు నీటి వినియోగం పై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలని మహవీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ బండ్లగూడ కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మధు పేర్కొన్నారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ నుంచి మహవీర్ కాలేజ్ వరకు కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, క్రీడాకారులతో కలిసి సోమవారం అవగాహన ర్యాలీ తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇంటింటా ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని కాపాడుకోవాలన్నారు. అలాగే నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనంజయ్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి అగ్నిహోత్రి, ప్రిన్సిపాల్ ఉషాశ్రీ, , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

శంషాబాద్ రూరల్: మండలంలోని బహదూర్‌గూడకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సోమవారం వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో నాయకులు వెంకటేశ్‌గౌడ్, మోతీయానాయక్, జంగయ్య, నందంగౌడ్, రాంరెడ్డి, సురేందర్ రెడ్డి, పలువురు కార్యకర్తలు ఉన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి నరేందర్, ఎంపీటీసీ ఎల్లయ్య, పార్టీ ప్రధాన కార్యదర్శి మహేందర్ పాల్గొన్నారు.

నీటి సమస్యలు లేకుండా చూడాలి

బండ్లగూడ: వేసవిలో నీటి సమస్యలు లేకుండా చూడాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి కోరారు. ఇదే విషయాన్ని జలమండలి జీఎం రవీందర్‌రెడ్డిని కలిసి వివరించగా ఆయన సానుకూలంగా స్పందించి నీటి ఇబ్బందుల్లేకుండా చూస్తామని హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు నేటి నుంచి అదనంగా రెండు ఎంఎల్ సరఫరా చేసేందుకు అనుమతి ఇచ్చారని తెలిపారు. అలాగే నీటి సమస్య అధికంగా ఉన్న ప్రాంతాలకు మున్సిపల్ ట్యాంకర్ ద్వారా, అదేవిధంగా నీటి సదుపాయం లేని చోట్ల 2000 లీటర్ల సింటెక్స్ ట్యాంక్‌లను ఏర్పాటు చేసి మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామని తెలిపారని అన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా కుదకరపోతే తానే సొంత ఖర్చులతో 10 సింటెక్స్ ట్యాంక్‌లను ఏర్పాటు చేసి నీటి సమస్యను తీరుస్తానని తెలిపారు.

'ఐఎస్‌బీ' పాఠ్య ప్రణాళికలో మార్పులు

రాయదుర్గం: దేశంలోని అత్యుత్తమ బిజినెస్ స్కూల్‌గా గుర్తింపు పొందిన గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్‌ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో కరికులమ్‌లో మార్పులు చేయాలని నిర్ణయించారు. అందుకు సంబంధించి ఐఎస్‌బీ నిర్వహించే కోర్సులలో ప్రధానంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీపీ) కోర్సు కోసం ప్రస్తుతం ఉన్న పాఠ్య ప్రణాళికపై సమీక్ష చేసింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ కోర్సులో సమగ్ర పాఠ్యాంశ్య సమీక్షను ఆవిష్కరించింది. ఈ ఏడాది నుంచే ఐఎస్‌బీలోని పీజీపీ కోర్సులో మార్పులకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు.

అగ్నిప్రమాదాలపై సమాచారం ఇవ్వాలి

సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి



అగ్నిమాపక వారోత్సవాల బ్యానర్లను ఆవిష్కరిస్తున్న సీపీ అవినాష్ మహంతి

గచ్చిబౌలి: అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటే వెంటనే అగ్నిమాపక శాఖ నెంబర్ 101కు సమాచారం అందించాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి సూచించారు. జాతీయ అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా రంగారెడ్డిజిల్లా అగ్నిమాపక సేవల శాఖ అధికారులతో కలిసి సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను, పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరుగకుండా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. అగ్ని భద్రతను నిర్ధారించండి, దేశాభివృద్ధికి సహకరించండి అనే థీమ్‌తో ఈ ఏడాది అగ్నిమాపక వారోత్సవాలు జరుపుతున్నారని గుర్తు చేశారు. రంగారెడ్డిజిల్లా ఫైర్ ఆఫీసర్ ఎస్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎక్కువగా వేసవిలో కిచెన్, గోడౌన్‌లలో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మాదాపూర్ అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ కె విజయ్‌కుమార్, మాదాపూర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ టి జగన్‌మోహన్, మరో ఫైర్ ఆఫీసర్ ఎంఏ ఫజల్, సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు సాధికారత కల్పించడమే లక్ష్యం

ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు



ఎస్కీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న వారితో ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు

రాయదుర్గం: పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన యువతకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఎస్కీ ఆధ్వర్యంలో 'ఏఐ-మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్-ఉద్యోగ పాత్రపై దృష్టి సారించే నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించింది. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ మార్గదర్శకత్వంలో కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ పీఎంకేవీవై4.0 స్పాన్సర్ చేసిన ఫ్లాగ్‌షిప్ చొరవతో ఈ కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్కీ నాణ్యమైన శిక్షణలు ఇవ్వడంతో పాటు పలు కోర్సులను కూడా నిర్వహిస్తూ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన వారిని తయారు చేసి అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంవీఎస్ఆర్ఈసీ డీన్, హెచ్‌ఓడీ వేణుగోపాలరావు, ఇన్‌చార్జి డాక్టర్ అఖిల్‌ఖరే,ప్రిన్సిపల్ డాక్టర్ జి కనకదుర్గ, వైస్‌ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్‌జీఎస్‌మూర్తి పాల్గొన్నారు.

అపరిశుభ్రత.. నాసిరకం ఆహారం..!

శంషాబాద్‌లో కొన్ని హోటళ్ల తీరు

- నిత్యం ఫిర్యాదుల వెల్లువ
- అడిగితే ఏకంగా వినియోగదారులపైనే దాడులు
- నామమాత్రంగా తనిఖీలు





తొండుపల్లిలోని ఓ హోటల్‌లో బయట పడ్డ నాసిరకం ఆహారం (ఫైల్) (ఇన్‌సెట్‌లో) చికెన్-65లో వచ్చిన పురుగు

శంషాబాద్: పట్టణంలోని కొన్ని హోటళ్ల తీరు అధ్వానంగా మారుతోంది. అసలే అపరిశుభ్రత.. మరోవైపు వినియోగదారులకు నాసిరకం ఆహారాన్ని అందిస్తూ వారి ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే శంషాబాద్‌లోని పలు హోటళ్లపై వినియోగదారుల ఫిర్యాదు లు ఇటీవల వెల్లువెత్తుతున్నాయి.

పట్టణంలో 50 పైగా హోటళ్లు..

పట్టణంలోని మున్సిపాలిటీ నుంచి ట్రేడ్ లైసెన్స్ కలిగినవి మొత్తం 50 పైగా హోటళ్లు ఉన్నాయి. వీటితో పాటు లైసెన్స్ లేని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, కర్రీ పాయింట్లు మరో 100 కు పైగా ఉన్నాయి. విమానాశ్రయంతో పాటు పట్టణానికి వివిధ పనులపై వచ్చే వేలాది మంది ప్రజలు భోజనం చేసేందుకు ఆయా హోటళ్లను ఆశ్రయిస్తుంటారు. అయితే వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాల్సి ఉండగా నాసిరకం ఆహారాలను వడ్డిస్తుండడంతో వినియోగదారులు మున్సిపాలిటీ అధికారులతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఘటనలు ఇక్కడ పెరుగుతున్నాయి.

పలు సంఘటనలు..

- పట్టణంలోని జాతీయ రహదారికి పక్కనే ఏడాది కిందట స్వీట్లు తీసుకున్న వ్యక్తికి అందులో పురుగులు కనిపించడంతో వాటిని తీసుకువచ్చి దుకాణం ముందు ఆందోళనకు దిగాడు.
- ఆర్నెల్ల కిందట బస్టాండ్‌కు సమీపంలో ఉండే ఓ హోటల్ బిర్యానీలో బొద్దింక రావడంతో వినియోగదారులు నేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదే హోటల్ యజమాన్యం అంతకుముందు ఏకంగా వినియోగదారులపై దాడి చేసిన ఘటన సంచలనం రేపింది.
- తొండుపల్లిలోని ఏడాది కిందట ప్రారంభించిన ఓ ప్రముఖ హోటల్‌లో కూడా మూడు నెలల కిందట నాణ్యత లేని ఆహారంపై వినియోగదారులు నేరుగా మున్సిపాలిటీ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయడంతో జరిమానా విధించారు.
- నాలుగు నెలల కిందట రాళ్లగూడ రహదారిలోని ఓ హోటల్‌లో భోజనం చేసి వినియోగదారులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో తాను హోటల్‌లో తిన్న ఆహారమే కారణమని వైద్యానికి కూడా భారీ డబ్బులు వెచ్చించానని సదరు హోటల్‌పై తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు.
- తాజాగా జాతీయరహదారి పక్కనే ఓ పెద్ద హోటల్‌లో కూడా వారం కిందట చికెన్-65లో పురుగులు రావడంతో హోటల్‌ను తనిఖీ చేసిన అధికారులు రూ. 10 వేల జరిమానా విధించిచారు.

తనిఖీలు చేపడుతాం..

పట్టణంలోని కొన్ని హోటళ్ల తీరుపై ఇటీవల ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి.దీంతో తనిఖీలు నిర్వహిస్తూనే ఉన్నాం. పరిశుభ్రత లేని హోటళ్లు, నాసిరకం ఆహారం అందిస్తున్నట్లు గుర్తించిన హోటళ్ల యజమానులకు జరిమానా విధిస్తున్నాం. ఇకనుంచి తనిఖీలను మరింత ముమ్మరం చేస్తాం.

–లక్ష్మయ్య, శంషాబాద్ మున్సిపాలిటీ హెల్త్ ఇన్‌స్పెక్టర్

నామమాత్రం తనిఖీలే..

నాణ్యత లేని నాసిరకం హోటళ్లకు శంషాబాద్ పట్టణం కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నా అధికారులు కేవలం ఫిర్యాదుల సమయంలోనే తనిఖీలు నిర్వహిస్తున్నారు. మిగతా సమయాల్లో హోటళ్ల పరిశుభ్రత, ఆహారం విషయంలో ఎలాంటి తనిఖీలు చేపడట్టడం లేదని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా కొన్ని హోటళ్లకు కొందరు ప్రజాప్రతినిధులు, నేతల అండదండలు కూడా ఉండడంతో వీరు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో పాటు వినియోగదారులపైనే దాడులకు దిగుతున్న సందర్భాలు కూడా ఉన్నాయి. మున్సిపాలిటీ అధికారులతో పాటు జిల్లా స్థాయిలోని ఫుడ్‌సేఫ్టీ అధికారులు కూడా పట్టణంలోని హోటళ్లపై వరుస తనిఖీలు చేపట్టాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటా ప్రచారం



ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్‌లోని ఉప్పర్‌పల్లిలోని 179, 78 పోలింగ్ బూత్‌లలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొక్క బాలారెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రచారం చేపడుతున్నామన్నారు. పార్టీ ఇచ్చిన కరపత్రం, స్టిక్కర్ ప్రతి ఇంటికి చేరాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులను గుర్తించి మిస్డ్ కాల్ ఇప్పించాలని సూచించారు. కార్యక్రమంలో గోనె శ్రీకాంత్ రెడ్డి, తుంగ ఇంద్రారెడ్డి, పుస్తకాల నర్సింగ్ రావు, పవన్, కరుణాకర్, మోహన్ రెడ్డి, అరవింద్, ముఖేశ్, పెంటా రెడ్డి, రాజ్‌పాల్ రెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

172 బూత్‌లో..

రాజేంద్రనగర్: రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు రాజేంద్రనగర్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు బాబురావు ఆధ్వర్యంలో 172 బూత్ ఇన్‌చార్జి వై.శ్రీధర్, పులుమామిడి రవీందర్, జ్ఞానేశ్వర్, పవన్, డి.కవిత, దయాకర్, ఎం.జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చెక్‌ల బౌన్స్‌పై చర్యలకు అధికారుల సన్నద్ధం

రాజేంద్రనగర్: ఆస్తిపన్ను చెల్లింపు కోసం చెక్కులను అందించి వాటిని బౌన్స్ చేసిన వారిపై చర్యలు తీసుకునేందుకు రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందుకు సంబంధించి ఉప కమిషనర్ రవి కుమార్ రెవెన్యూ అధికారుల నుంచి సోమవారం సమాచారాన్ని సేకరించారు. సర్కిల్ పరిధిలో అధికారులు వందశాతం ఆస్తిపన్ను వసూలు చేసి రికార్డు సృష్టించారు. కానీ ఇందులో 11 చెక్కులు బౌన్స్ అయ్యాయి. వీటి విలువ రూ.11 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఆదేశించడంతో సర్కిల్ అధికారులు చెక్ బౌన్స్ అయిన వారి వివరాలు, చెక్కులను ఉప కమిషనర్‌కు అందజేశారు. ఆయన ఆదేశాల మేరకు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రాజేంద్రనగర్ పోలీసులకు లేఖ రాస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చెక్ బౌన్స్ అయిన వారిపై కేసులు నమోదు చేసేందుకు జీహెచ్ఎంసీ అధికారులు సిద్ధమవుతుండడం గమనార్హం.

సంక్షేమమే ధ్యేయం.. అభివృద్ధే ఎజెండా

చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ జి.రంజిత్‌రెడ్డి



గోపన్‌పల్లితాండలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి

రాయదుర్గం: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమమే ధ్యేయంగా, అభివృద్ధే ప్రధాన ఎజెండాగా పనిచేస్తుందని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ జి రంజిత్‌రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లితాండలో ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని, అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ప్రకటించిన న్యాయ గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు. అంతకుముందు గోపన్‌పల్లి తాండలోని గిరిజన మహిళలు తమ సాంప్రదాయ దుస్తులు ధరించి కాంగ్రెస్ నాయకులకు ఘన స్వాగతం పలుకడం విశేషం. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

టీఆర్ఎస్‌పార్టీ గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు రాజునాయక్, పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో చేవెళ్ల అభ్యర్థి డాక్టర్ జి రంజిత్‌రెడ్డి పార్టీ కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

బీజేపీతోనే అభివృద్ధి

గోల్కొండ: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి కె.మాధవీలత అన్నారు. సోమ వారం ఆమె కార్వాన్, గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆమె మాట్లా డుతూ.. కేవలం మైనార్టీ ఓట్ల పేరుతో మజ్లిస్ పార్టీ హైదరాబాద్ నుంచి గెలుస్తూ వస్తుందన్నారు. హైదరాబాద్ నగరాన్ని మాత్రం ఆ పార్టీ అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. దేశంలో పదేళ్ల బీజేపీ పాలన అభివృద్ధి అంటే ఏమిటో అద్దం పట్టినట్లు చూపిస్తుందని ఆమె అన్నారు. ప్రతి ఒక్కరూ తనకు ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు.



హైదరాబాద్ పార్లమెంటు బీజేపీ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, శివరత్నం, దోరుతుల శ్రీనివాస్, గోవర్ధన్, మధుసూధన్, దేవర వంశీ తదితరులు పాల్గొన్నారు.

అక్షయ పాత్ర వంటశాల ఆధునీకరణకు సహకారం



భోజనాలను సరఫరా చేసే వాహనాలను ప్రారంభిస్తున్న సంస్థల ప్రతినిధులు

మణికొండ: నార్సింగిలోని అక్షయపాత్ర ఫౌండేషన్ వంటశాలను ఆధునికీకరణ చేసేందుకు జెమిని ఎడిబుల్స్ సంస్థ తనవంతూ సహకారాన్ని అందించింది. ఇప్పటివరకు 37 వేల మందికి ప్రతిరోజు వండే ప్రస్తుత వంటశాల సామర్థ్యాన్ని 50 వేలకు పెంచడంతో పాటు ఆహారాన్ని త్వరగా సరఫరా చేసేందుకు అవసరమైన మూడు వాహనాలను సోమవారం అందజేసింది. వాటిని జెమిని ఎడిబుల్స్ సేల్స్, మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రాంతీయ అధ్యక్షుడు, ట్రస్టీ సత్యగౌర చంద్ర దాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్షయపాత్ర ట్రస్టీ సభ్యుడు మాట్లాడుతూ నార్సింగిలోని వంటశాలను ఆధునికరించాలన్న తమ లక్ష్యంలో మరో ముందడుగు పడిందన్నారు. రూ. 2 కోట్ల నిధులతో వంటశాలలో మరింత మెరుగైన సౌకర్యాలను కల్పించడంతో పాటు విద్యుత్ వాహనాలను అందించడంతో పిల్లలకు చేసే సేవలో సమర్థత, స్థిరత్వాల్లో నూతన ప్రమాణాలను ఆవిష్కరిస్తామన్నారు. అక్షయపాత్ర సీఈఓ శ్రీధర్ వెంకట్ మాట్లాడుతూ సామాజిక సంక్షేమంపై జెమిని ఎడిబుల్స్ సంస్థ తన నిబద్ధతను చాటుకుందని కొనియాడారు. కార్యక్రమంలో రెండు సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్ట్ సంస్థే రోడ్ల నిర్వహణ చేపట్టాలి'



పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న జీహెచ్ఎంసీ కార్మికులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రధాన రహదారులను గతంలో జీహెచ్ఎంసీ కంప్రహెన్సివ్ రోడ్డు మెయింటెన్స్ ప్రోగ్రాం (సీఆర్ఎంపీ) అనే సంస్థకు అప్పగిందని.. కానీ ఇప్పటికీ జీహెచ్ఎంసీ కార్మికులే రోడ్లను శుభ్రం చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి జైపాల్ రెడ్డి ఆరోపించారు. రాజేంద్రనగర్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పిల్లర్ నంబర్ 117 నుంచి ఆరాంఘర్ చౌరస్తా, మైలార్‌దేవ్‌పల్లి, ఆర్టీసీ బస్టాండ్ వరకు, దుర్గానగర్ చౌరస్తా నుంచి ఓల్డ్ కర్నూల్ రోడ్డు, గగన్‌పహాడ్ వరకు ఉన్న ప్రధాన రహదారిని ప్రతిరోజూ సీఆర్ఎంపీ సంస్థ పారిశుధ్య పనులతో పాటు నిర్వహణ చూసుకోవాల్సి ఉంటుందని, ఇందుకోసం జీహెచ్ఎంసీ ప్రతి నెల లక్షల రూపాయలు చెల్లిస్తుందన్నారు. అయినా ఈ రోడ్లను సంస్థ సిబ్బంది పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బస్తీలు, కాలనీల్లో పారిశుధ్య పనులు నిర్వహించే సిబ్బందిని అక్కడి నుంచి ప్రధాన రహదారులపైకి పని చేసేందుకు పంపించడంతో కాలనీ, బస్తీల్లో చెత్తాచెదారం పేరుకుపోతుందన్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తగు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

రాజేంద్రనగర్‌లో ఎన్ఎస్‌యూఐ సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎన్ఎస్‌యూఐ కార్యదర్శి ఫాద్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ఉప్పర్‌పల్లి సామ భూపాల్ రెడ్డి గార్డెన్‌లో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సమావేశాన్ని నిర్వహించారు. మీటింగ్‌కు హాజరైన జాతీయ ఎన్ఎస్‌యూఐ కార్యదర్శి ఫాద్, ప్రభుత్వ సలహదారు వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వివరించి కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ప్రతి నియోజకవర్గం నుంచి 20 వేల ఓట్ల మెజార్టీ సాధిస్తూ మొత్తం 1,40,000 ఓట్లను సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి, నేషనల్ ఇన్‌చార్జి రాష్ట్ర డెయిరీ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కస్తూరి నరేందర్, మహిళా ఉపాధ్యక్షురాలు సదాలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు బాలరాజు, బి-బ్లాక్ అధ్యక్షుడు మహ్మద్ ఖాలేద్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎన్.ధనుంజయతో పాటు ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఉప్పర్‌పల్లి ప్రాంతంలో రంజిత్ రెడ్డి ప్రచారాన్ని చేపట్టి ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఆకట్టుకున్న 'అర్ధనారీశ్వరం'

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హిరణ్మయ్ నాట్యాల య ఆధ్వర్యంలో 'అర్ధనారీశ్వరం'పేరిట సోమ వారం రవీంద్రభారతిలో నిర్వహించిన నృత్య రూపకం ఆకట్టుకుంది. వివిధ రాష్ట్రాలకు చెందిన శివశక్తుల ప్రయాణ సమూహ నృత్యాలు ఒకే వేదికపై ప్రదర్శించిన తీరు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. తుల్జాపూర్, మధురై, కాశి, కలకత్తా, అల్లంపూర్ ప్రాంతాల నృత్యం కనువిందు చేసింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు హాజరై నృత్యగురువు బి.ప్రియాంక చేసిన ప్రయత్నం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత భాగవతుల సేతురామ్, కూచిపూడి నృత్యగురువు కళాకృష్ణ పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి



లార్డ్స్ కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న శరత్‌చంద్ర

బండ్లగూడ: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిఒక్కా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోల్ పార్టిసిపేషన్(స్వీప్) నోడల్ ఆఫీసర్, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. 'పార్లమెంట్ ఎలక్షన్-2024 స్వీప్' కార్యక్రమంలో భాగంగా 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' అనే థీమ్‌తో సోమవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హిమాయత్‌సాగర్‌లోని లార్డ్స్ కళాశాలలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన విద్యార్థులు ఓటరుగా నమోదు నమోదు చేసుకోవాలన్నారు. ఎన్నికనల్లో ఎలాంటి ఒత్తిడిలకు లోనుకాకుండా, నగదు తీసుకోకుండా మంచి వ్యక్తికి ఓటు వేసి మంచి సమాజాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ శశికిరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ విషాద్, క్యాంపస్ ఇన్‌చార్జి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

టైమ్స్ స్కూల్‌లో..

విద్యార్థులకు ఓటు ప్రాముఖ్యతను వివరించి దానిని వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందని సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోల్ పార్టిసిపేషన్ (స్వీప్) నోడల్ ఆఫీసర్, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. సోమవారం ట్రింపంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్ (టి.ఐ.ఎం.ఈ)లో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులం, మతం, జాతి, వర్గం, భాషలకు అతీతంగా విద్యార్థులు కలిసి మెలిసి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ సుచిశుక్ల, రవి సాంబారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ట్రింపంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్‌లో పాల్గొన్న శరత్‌చంద్ర

ఓటు హక్కును వినియోగించుకోవాలి

అత్తాపూర్: ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సీఆర్పీఎఫ్, టీఎస్ఎస్‌పీ ఫోర్స్ రాజేంద్రనగర్ డివిజన్ పోలీసులు సంయుక్తంగా అత్తాపూర్ గురుద్వార్ చింతల్‌మెట్, పాకిజా హోటల్ నుంచి ఫోర్స్ చింతల్‌మెట్ 9 నంబర్ తదితర ప్రాంతాల్లో బ్యానర్లు పట్టుకుని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఉప్పర్‌పల్లి చౌరస్తాలోని సామా దామోదర్‌రెడ్డి గార్డెన్‌లో ప్రజలను ఉద్దేశించి డీసీపీ మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో అమూల్యమైనదని, ఓటర్లను ఆకర్షించేందుకు బహుమతులు, రూపంలో నగదు రూపంలో అందించే వారిపై అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ విజయ్‌కుమార్, ఏసీపీ తుల శ్రీనివాస్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్ సీఐలు మధు, వెంకట్‌రాంరెడ్డి, నిమ్మల వెంకన్న, నాగరాజు, శ్రీనివాస్, ఎస్ఐ కిష్టయ్య, నయీం హుస్సేన్, రాములు , అత్తాపూర్ ఎస్ఐ మహ్మద్ హర్షన్ అలీ తదితరులు పాల్గొన్నారు.



అత్తాపూర్ డివిజన్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు